
సాక్షి
నంద్యాల
మంగళవారం : 22 ; ఏప్రిల్ ; 2025



శివతత్వంపై ప్రవచనం

శ్రీశైలం టెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం విశాఖపట్నంకు చెందిన శ్రీనివాసమూర్తి వారిచే శివతత్వంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం భక్తుల సందడి కొనసాగింది. భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



గో బ్యాక్ జేడీ వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత దేశ పర్యటనను నిరసిస్తూ ప్రజా సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. భారత ఉత్పత్తులపై పెంచిన పన్నులను తగ్గించే వరకు దేశంలో పర్యటించకూడదన్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 20 మోడల్ స్కూళ్లలో (ఆదర్శ పాఠశాలలు) 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి సోమవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. డీఈఓ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,948 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 2,583 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 365 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకులు సృజన పాములపాడు, జూపాడుబంగ్లా పరీక్ష కేంద్రాలను సందర్శించారన్నారు.

25న 'గురుకుల' ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5, 6, 7, 8 తరగతులకు గాను మొత్తం 836 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా నంద్యాల పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 5, 6, 7, 8వ తరగతులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏపీఆర్‌ఎస్ సెట్ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని విద్యార్థులు తమ హాల్‌టికెట్లను https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఐడీ, పుట్టిన తేదీ నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో తాత్కాలిక సీనియారిటీ జాబితా

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ తాత్కలిక జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆధారంగా వచ్చిన అభ్యంతరాలను సరిచేసి జాబితాను తయారు చేశామన్నారు. జాబితాను httpr://deokrnl13.bolgspot.comలో సరిచూసుకోవాలని డీఈఓ పేర్కొన్నారు.

ఆస్పరిలో 80 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లాలో 80 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును నెలకొల్పేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విండ్ పవర్ ప్రాజెక్టును జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ఏర్పాటు చేస్తోంది. ఆస్పరి మండలంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయానంద్ జీవో ఎంఎస్ నెంబర్ 36 జారీ చేశారు.



తుగ్గలి మండలంలో ఉపాధి పనులకు తుక్కువగా హాజరైన కూలీలు

ఉపాధి పక్కదారి.. కూలీల వలసదారి!

మితిమీరిన రాజకీయ జోక్యం

- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన పనిదినాలు
- దొంగ మస్టర్లతో ఎక్కడికక్కడ అక్రమాలు
- యంత్రాలతో పని చేయిస్తున్న వైనం
- జిల్లాలో పెరిగిన వలసలు



ఉపాధి పనులు లేక కోసిగి నుంచి వాహనాల్లో వలస వెళ్తున్న కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్‌తో పాటు రబీ కూడా రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఈ పరిస్థితుల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులకు అండగా నిలవాల్సి ఉంది. అలాంటిది.. 2024–25 సంవత్సరంలోని అంకెలను పరిశీలిస్తే ఉపాధి అంతంత మాత్రమే ఉన్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉపాధిలోనూ ఆ పార్టీ నేతల పెత్తనం అధికమైంది. వంద శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా టీడీపీ నేతలు, కార్యకర్తలతో పాటు అవకాశం ఉన్న చోట బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మాత్రమే లబ్ధి పొందుతున్నారు. ఇష్టానుసారం దొంగ మస్టర్లు వేయడం, యంత్రాలతో పనులు చేయించడం, పాత పనులకు బిల్లులు చేయించడం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారు. 2023–24 సంవత్సరంతో పోలిస్తే 2024–25లో సాధించిన ప్రగతి అంతంతమాత్రమే కావడం గమనార్హం. అక్రమాలకు ప్రస్తుతం ఫాంపాండ్స్ కేంద్ర బిందువుగా మారుతున్నాయి. ఈ పనులను పూర్తిగా లేబర్‌తోనే చేయించాల్సి ఉన్నా.. రాత్రికి రాత్రి యంత్రాలతో పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాత కూలీలతో చేయించినట్లుగా మస్టర్లు వేస్తున్నారనే చర్చ జరుగుతోంది. పత్తికొండ నియోజకవర్గంలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నట్లు సమాచారం.

పని దినాలు	
వైఎస్సార్‌సీపీ హయాం	కూటమి ప్రభుత్వం
2023-24	2024-25
99,25,125	89,02,115

లక్ష్యాన్ని మించి పనిదినాలట!

నంద్యాల జిల్లాలో 2024–25లో 75 లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యం. అయితే 74,75,335 పని దినాలు కల్పించినట్లు సమాచారం. నందికొట్కూరు, పాములపాడు, గోస్పాడు, సంజామల, కొలిమిగుండ్ల, ప్యాపిలి, ఉయ్యాలవాడ, మహానంది, నంద్యాల, కోవెలకుంట్ల, మిడుతూరు, డోన్, దొర్నిపాడు, జూపాడుబంగ్లా, పాణ్యం మండలాల్లో బోగస్ హాజరు ఎక్కువగా ఉంది. ఈ మండలాల్లో లక్ష్యం కంటే ఎక్కువ పని దినాలను వినియోగించుకోవడమే ఇందుకు నిదర్శనం.

తగ్గిన పని దినాలు

- 2023–24 సంవత్సరంతో పోలిస్తే 2024–25లో 10.23 లక్షల పని దినాలు తగ్గిపోయాయి.
- ఉపాధి కల్పించినట్లుగా చెబుతున్న 89.02 లక్షల పనిదినాల్లోను 25 శాతం వరకు బోగస్ అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లతో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కుమ్మక్కై బోగస్ అటెండెన్స్ ఎక్కువగా వేసినట్లు తెలుస్తోంది.
- 2023–24లో లేబర్ కాంపోనెంటు కింద రూ.308.31 కోట్లు ఖర్చు చేయగా.. 2024–25లో కేవలం రూ.250 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది.
- 2024–25 సంవత్సరంలో 19,808 కుటుంబాలకు వందరోజుల పని కల్పించారు.
- కూటమి ప్రభుత్వంలో 11,327 కుటుంబాలకే వందరోజుల పని పరిమితమైంది.
- 2023–24 సంవత్సరంలో 5 ఎకరాలోపు సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి నిధులతో దాదాపు 5000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేశారు.
- 2024–25లో 3,774 ఎకరాల్లో మాత్రమే పండ్లతోటలు అభివృద్ధి చేయడం గమనార్హం.

పెరిగిన వలసలు

2024–25 సంవత్సరంలో జిల్లా నుంచి వలసలు భారీగా పెరిగాయి. గత ఏడాది ఇదే సమయంలో రోజుకు 75 వేల మంది వరకు ఉపాధి పనులకు హాజరు కావడం జరిగింది. ప్రస్తుతం రోజుకు 35 వేల మంది మాత్రమే వస్తున్నారు. మిగిలిన వారంతా వలసబాట పట్టినట్లు తెలుస్తోంది. వలస వెళిన వారు కూడా ఇక్కడ ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు దొంగమస్టర్లు వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా నుంచి కనీసం 60వేల కుటుంబాలు వలసబాట పట్టినట్లు సమాచారం.

బకాయిలు రూ.250 కోట్ల పైమాటే

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు లేబర్ కాంపోనెంటు, మెటీరియల్ కాంపోనెంటు కింద చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు రూ. 250 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగాది పండగ సమయంలో కూడా ఉపాధి కూలీలకు వేతనాలు లేకపోవడం విమర్శలకు తావిచ్చింది. బకాయిలు ఎప్పటికి విడుదల అవుతాయే కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.

క్వింటా పత్తి రూ.8,179



ఆదోని మార్కెట్‌లో పత్తి దిగుబడులు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం పత్తి ధర రూ.8,179 పలికింది. గత వారంలో రూ.8వేలు ఉండింది. సోమవారం 661 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా గరిష్ట ధర రూ.8,179, మధ్య ధర రూ.7,589, కనిష్ట ధర రూ.4,509 నమోదైంది.

- వేరుశనగకాయలు 988 సంచులు రాగా గరిష్ట ధర రూ.6,626, మధ్య ధర రూ.6,336, కనిష్ట ధర రూ.3,199 పలికింది.
- ఆముదాలు 30 సంచులు రాగా గరిష్ట ధర రూ.5,892, మధ్య ధర రూ.5,892, కనిష్ట ధర రూ.5,290 వచ్చింది.
- పూల విత్తనాలు నాలుగు సంచులు రాగా గరిష్ట ధర రూ.3,200, కందులు 20 సంచులు రాగా గరిష్ట ధర రూ.4,822 నమోదైంది.

కరువు మండలాల్లో మొదలైన ఎన్యూమరేషన్

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 రబీ కరువు మండలాల్లో పంట నష్టంపై ఎన్యూమరేషన్ మొదలైంది. ఈ నెల 25వ తేదీ సాయంత్రంలోపు జిల్లా కలెక్టర్ ద్వారా పంట నష్టంపై ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ కోసం నివేదిక పంపాలని వ్యవసాయ శాఖ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. కేవలం వర్షాధారం కింద సాగు చేసిన పంటలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ఒక రైతుకు 5 హెక్టార్ల వరకు మాత్రమే నమోదు చేయాలని, దెబ్బతిన్న పంటలు ఈ–క్రాప్‌లో నమోదై ఉండాలని సూచించారు. జిల్లాలో కల్లూరు, కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కోడుమూరు, గూడూరు, ఓర్వకల్లు, ఆస్పరి, వెల్దుర్తి, మద్దికెర, పత్తికొండ మండలాలను ప్రభుత్వం రబీ కరువు మండలాలుగా గుర్తించింది.

మెడికల్ క్యాంపునకు ఉపాధ్యాయులు హాజరు కావాలి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ క్యాంపునకు హాజరు కావాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్టు 2025 ప్రకారం ప్రిఫరేషనల్ కేటగిరి, స్పెషల్ పాయింట్స్ పొందాల్సిన వారు ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జరిగే ప్రభుత్వ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి వైద్యులతో పరిశీలన చేయించుకుని నూతన మెడికల్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలన్నారు.

వారం రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం

- శుభలేఖలు పంచుతూ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- అదే దారిలో ఆటోలో వెళ్తూ కుమారుడి మృతదేహాన్ని గుర్తించిన తల్లి



నాగేంద్ర (ఫైల్)



ప్రమాద స్థలంలో రోదిస్తున్న తల్లి

పాములపాడు: వారం రోజుల్లో పెళ్లి. ఇంట్లో కుటుంబీకులంతా పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. రోజులు సమీపిస్తుండటంతో హడావుడి మొదలైంది. అంతలోనే విషాదం నెలకొంది. శుభలేఖలు పంచుతూ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిపై కంబాలపల్లి సమీపంలో సోమవారం బైక్, బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆత్మకూరు పట్టణం ఏకలవ్యనగర్‌కు చెందిన ఈసారి నాగేంద్ర(24)కు ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. ఈ నెల 29న ముహూర్తం, 30న తలంబ్రాలుగా నిర్ణయించారు. పెళ్లి పనుల్లో భాగంగా తమ బంధువులకు శుభలేఖలు పంచేందుకు నాగేంద్ర సోమవారం బైక్‌పై లింగాల గ్రామానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి తిరిగి వెళ్తుండగా కంబాలపల్లి గ్రామ సమీపంలో నేషనల్ హైవేకు చెందిన బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడి తల్లి నాగసుబ్బమ్మ పాములపాడులో పని చూసుకుని ఆటోలో ఆత్మకూరుకు బయలుదేరింది. మార్గమధ్యలో కంబాలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరగడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఆ సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమారుడు ధరించిన దుస్తులను గుర్తించి నాగ సుబ్బమ్మ అనుమానంతో ఆటో దిగింది. దగ్గరికి వెళ్లి చూడగా చనిపోయింది తన కొడుకే అని తెలుసుకుని కన్నీరుమున్నీరుగా విలపించింది. 'వారం రోజుల్లో పెళ్లి కొడుకువు కావాల్సిన వాడివి ఇలా ఎందుకు చనిపోయావు' అంటూ ఆమె రోదిస్తున్న తీరు పలువురిని కలిచి వేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తల్లి నాగసుబ్బమ్మ, తండ్రి కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

చిన్నారులకు అగ్ని పరీక్ష

- ఈ నెల 24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు
- అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వని వైనం
- చిన్నారులకు తప్పని వేసవి సెగ



కోవెలకుంట్లలో అద్దె భవనంలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులు

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు: 1,620
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు: 43
0–6 నెలల శిశువులు: 16,434
7 నెలలు– మూడేళ్లలోపు: 66,054
3–6 సంవత్సరాల్లోపు చిన్నారులు: 41,216

కోవెలకుంట్ల: ఏటా వేసవికాలం ప్రారంభం కాగానే మార్చి 15 నుంచి పాఠశాలలకు ఒంటి పూటబడులు, ఏప్రిల్ 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ఇస్తున్నారు. పూర్వప్రాథమిక విద్యనభ్యసించే చిన్నారులకు వేసవి కాలం శిక్ష తప్పడం లేదు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు వర్తింపచేయకుండా కూటమి సర్కార్ చిన్నారుల జీవితాలతో చెలగాటమాడుతోంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో1,620 అంగన్‌వాడీ, 43 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 1.23 లక్షల మంది సున్న నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులకు 1,663 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్వప్రాథమిక విద్యను బోధిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు లేకపోవడంతో వేసవిలో కేంద్రాలను నిర్వహించాల్సిందే. అంగన్‌వాడీ కేంద్రంలో ఏడాది నుంచి ఆరు సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న వారే. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించకుండా వేళల కుదింపుతో సరిపెట్టడంతో చిన్నారులకు వేసవికాలం అగ్ని పరీక్షగా మారింది. వసతులు లేమి, అద్దె భవనాలు, మండుటెండలు చిన్నారులకు శాపంగా మారాయి. జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సగానికిపైగా కేంద్రాలకు సొంత భవనాలు లేవు. కొన్ని ప్రభుత్వ భవనాల్లో వసతులు లేవు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నుంచే ఎండలు అధికమయ్యాయి. ఫ్యాన్లు కూడా లేని అంగన్‌వాడీ కేంద్రాలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఫ్యాన్లు అటుంచితే గాలి, వెలుతురు లేక చిన్నారుల బాధలు వర్ణనాతీతం. వేసవికాలం కావడంతో ఉదయం 9 గంటల నుంచే భానుడి విశ్వరూపానికి జనాలు విలవిల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో అంగన్‌వాడీలకు వెళ్లే ఆరేళ్లలోపు చిన్నారుల అవస్థలు వర్ణనాతీతం.

చిన్నారులకు తప్పని వేసవి సెగ

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గత నెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తుండగా అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వర కు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ పాఠశాలలకు ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాల్సి ఉంది. అయితే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పనివేళలను కుదించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతోపాటు ఉక్కపోతతో కేంద్రాల్లో చిన్నారులు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులను ఇళ్లకు పంపివేసి కార్యకర్తలు, ఆయాలు ఇళ్లకు వెళుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు వర్తింపచేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్యకర్తలు, ఆయాలకు 15 రోజుల సెలవులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసించే చిన్నారులకు ఎలాంటి వేసవి సెలవులు లేకపోగా ప్రభుత్వం కార్యకర్తలు, ఆయాలకు నామమాత్రపు వేసవి సెలవులతో సరిపెట్టింది. మే 1వ తేదీ నుంచి ఆయాలకు 15 రోజులపాటు మే 16 నుంచి 31వ తేదీ వరకు కార్యకర్తలకు వేసవి సెలవులున్నాయి. ఆయాలకు 15 రోజులు, కార్యకర్తలకు 15 రోజుల చొప్పున సెలవులు కేటాయించింది. మొదటి పదిహేను రోజులు అంగన్‌వాడీ కార్యకర్తనే ఆయా బాధ్యతలు కూడా నిర్వర్తించాల్సి ఉంది. చిన్నారులను కేంద్రాలకు వచ్చేలా చూడటం, విద్యబోధించడం, మధ్యాహ్న భోజనం అందించడం, తదితర పనులు చేపట్టాల్సి ఉంది. తర్వాతి పదిహేను రోజులు కార్యకర్త విధులు ఆయా నిర్వర్తించాల్సి ఉంది. జూన్ 1వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు యధావిధిగా కొనసాగుతాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు లేకపోగా ప్రతి నెలా రెండవ శనివారం, కొన్ని ప్రభుత్వ సెలవు రోజుల్లో సైతం కేంద్రాలను నిర్వహించాల్సి వస్తోంది.

వేసవి సెలవులు ఇవ్వకపోవడం విచారకరం



వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వకపోవడం విచారకరం. కేంద్రాల్లో ఏడాది నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఎండలు అధికం కావడంతో కేంద్రాల్లో చిన్నారులు వేసవి సెగతో అల్లాడిపోతున్నారు. ప్రభు త్వ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి. – **మాబు ఉసేన్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు, కోవెలకుంట్ల**

చిన్నారుల వయస్సును పరిగణలోకి తీసుకోవాలి



వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన సర్కార్ చిన్నారులను విస్మరించడం అన్యాయం. దీనికి తోడు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో వసతులు లేని భవనాల్లో చిన్నారులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. వారి వయస్సును పరిగణలోకి తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలి. – **ఓబులేసు, ఆర్పీఎస్ విద్యార్థి సంఘం నాయకుడు, కోవెలకుంట్ల**

రీ ఓపెన్ ఫిర్యాదులపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రీ ఓపెన్ అయిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ ఓపెన్ దరఖాస్తులు 68 ఉన్నాయని వీటన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 1,641 దరఖాస్తులను పరిష్కారం చూపాలన్నారు. సీఎంఓ కార్యాలయం, వీఐపీ గ్రీవెన్స్‌కు సంబంధించి 15 పెండింగ్‌లో ఉన్నాయని వీటిని కూడా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదుల అర్జీదారుల అభిప్రాయ సేకరణ వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర యాప్‌లో పెండింగ్‌లో ఉన్న శాఖలు తక్షణమే సంబంధిత అంశాలను పూరించి ఫొటోలతో సహా అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా పెండింగ్‌లో ఉన్న 451 మంది మిస్సింగ్ ఎంప్లాయిస్ డేటా, సిటిజన్ ఈ–కేవైసీ, వర్క్ ఫ్రం హోం డేటా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబర్‌ను 40 శాతం మంది మాత్రమే మొబైల్ యాప్ వినియోగిస్తున్నారని ఇంటింటికి వెళ్లి మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరి చేత నంబర్ సేవ్ చేయించి హాయ్.. అని మెసేజ్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లలో ఎల్లప్పుడూ నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 290 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వానలు పడుతున్నా ఉక్కపోతే!

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో అకాల వర్షాలు కురిసినప్పటికీ ఉష్ణోగ్రతలు తగ్గలేదు. తీవ్రస్థాయిలో వడగాల్పులు ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపు వానలు కురుస్తుండగా, మరోవైపు ఎండలు తీవ్రత కొనసాగుతోంది. పాణ్యంలో 41.1 డిగ్రీలు, మంత్రాలయంలో 40.8, నంద్యాలలో 40.7, దొర్నిపాడులో 40.7, మహానందిలో 40.6, కొత్తాలంలో 40.5, అవుకులో 40.4, బేతంచెర్లలో 40.0, కర్నూలు అర్బన్‌లో 40.3 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడిన నేపథ్యంలో రానున్న మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రేపు పత్తి పంటపై కిసాన్ మేళా

ఎమ్మిగనూరురూరల్: బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 23న పత్తిలో కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో చోరీ

- రూ.6 వేల నగదు అపహరణ


మాట్లాడుతున్న ఆర్టీసీ డ్రైవర్ మధుసూదన్‌రెడ్డి

ఆదోని అర్బన్: ఆర్టీసీ బస్సులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆదోని పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కం కండెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో ఆదోనికి బయలుదేరారు. కోడుమూరులో ఓ వ్యక్తి తన పేరు శ్రీనివాస్ అని, సత్తివీడుకు చెందిన ఆర్టీసీ ఎంప్లాయినంటూ డూప్లికేట్ ఆర్టీసీ పాస్ చూపించి బస్సు ఎక్కాడు. గోనెగండ్లలో డ్రైవర్ కం కండెక్టర్ ప్రయాణికులకు టికెట్ కొడుతుండగా శ్రీనివాస్ డ్రైవింగ్ సీటు వద్ద నగదు ఉన్న బ్యాగు, సెల్‌ఫోన్ తీసుకుని బస్సు దిగి వెళ్లిపోయాడు. టికెట్లు పూర్తి చేసుకుని బస్సును కాస్త ముందుకు నడుపుకుంటూ వచ్చిన కాసేపటికి బ్యాగు లేదని గమనించిన డ్రైవర్ కం కండెక్టర్ వెంటనే మరో బస్సు డ్రైవర్‌కు సమాచారం చేరవేశాడు. అతడు గోనెగండ్లలో బ్యాగుతో ఉన్న వ్యక్తిని పట్టుకునేందుకు వెళ్లేలోపే సెల్‌ఫోన్ పడేసి బ్యాగ్‌తో పరారయ్యాడు. బ్యాగులో రూ.6 వేల నగదు ఉందని, తెలిసిన వారితో అప్పు చేసి కౌంటర్లో కట్టానని డ్రైవర్ కం కండెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సలహాతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

నువ్వుల కట్టెకు నిప్పు


బూడిదగా మారిన నువ్వుల కట్టె

ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని అమలాపురం గ్రామానికి చెందిన రైతు స్వామన్న పొలంలో కోత కోసి కుప్ప నూర్చేదుకు సిద్ధంగా ఉంచిన నువ్వుల కట్టెకు సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. బాధితుడు తెలిపిన వివరాలు.. తనకు ఉన్న పొలంతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని నువ్వుల పంట సాగుచేశాడు. పైరును ఇటీవల కోసి కుప్ప నూర్చేందుకు సిద్ధం చేశాడు. అంతలోనే గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో దాదాపు 10 క్వింటాళ్ల నువ్వులు బూడిద పాలయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా స్వామన్న వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు కావడం, ఇటీవల గ్రామంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనల నేపథ్యంలోనే ఓర్వలేని వారు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

వీఆర్‌ఓ అనుమానాస్పద మృతి


కె.సత్యనారాయణరావు (ఫైల్)

హాలహర్వి: మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఓ కె.సత్యనారాయణరావు(44) సోమవారం అనుమానాస్పదంగా మృతిచెందారు. కె.సత్యనారాయణ రావు కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈవిషయమై భార్య భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య రూప భర్తకు దూరంగా పుట్టినిల్లు ఎమ్మిగనూరులో ఉంటోంది. కాగా మద్యం తాగి విధులకు హాజరవుతుండటంతో సత్యనారాయణరావును అధికారులు సస్పెండ్ చేశారు. ఈక్రమంలో సోమవారం ఇంట్లో విగతజీవిగా పడివున్న సత్యనారాయణరావును గుర్తించిన స్థానికులు అతని భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆమె హాలహర్వికి చేరుకుని భర్త మృతదేహంపై పడి బోరున విలపించింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పంట వ్యర్థాలను ఏరుతున్న కూలీలు


వ్యర్థాలను తగలబెడుతున్న దృశ్యం

మరో ఆశల సాగు..

రబీలో నష్టపోతే ఖరీఫ్.. ఖరీఫ్ ముంచితే రబీ.. ఏటా అన్నదాతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూనే ఉంటారు. ఈ ఏడాది రబీ పంటలు అంతంత మాత్రంగానే చేతికందడంతో ఖరీఫ్‌పై కోటి ఆశలతో సాగుకు సిద్ధమవుతున్నారు. కల్లూరు, కోడుమూరు మండలాల్లో పంటల వ్యర్థాలను, కంప చెట్లను తొలగించి పొలాలను రూపు చేసుకునే పనుల్లో రైతన్నలు నిమగ్నమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


సహపంక్తి భోజనం చేస్తున్న కూలీలు

ఉద్యోగం పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు
- పీజీఆర్‌ఎస్‌కు 128 ఫిర్యాదులు


ఎస్పీకి సమస్యను విన్నవిస్తున్న బాధితురాలు

కర్నూలు: స్థానిక బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న కరెంటు ఆఫీస్‌లో తన కుమారుడు రమేష్‌కు ఏఈ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అందులో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగి రామాంజనేయులు రూ.22 లక్షలు తీసుకుని మోసం చేశాడని, విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా సీతారాం నగర్‌కు చెందిన శాంతమ్మ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 128 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నిటిపై చట్టపరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పి గుర్తు తెలియని వ్యక్తులు 18 విడతలుగా రూ.62 లక్షలు వారి ఖాతాలో జమ చేసుకుని మోసం చేశారని కర్నూలుకు చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు. వాట్సాప్‌లో లింక్ పంపి దానిని క్లిక్ చేసిన తర్వాత ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం వస్తుందని చెప్పి మొదట రూ.1.20 లక్షలు వారి ఖాతాలో వేయించుకుని తిరిగి డబ్బులు పంపి నమ్మించారని, తర్వాత భారీ మొత్తంలో డబ్బు వేయించుకుని విత్‌డ్రా ఆప్షన్ ఇవ్వకుండా తన మొబైల్ నెంబర్‌ను బ్లాక్ చేసి మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా కొంత మొత్తాన్ని ఫ్రీజ్ చేశారని, ఎఫ్ఐఆర్ చేయించి ఫ్రీజ్ చేసిన మొత్తాన్ని కోర్టు నుంచి ఇప్పించాలని బాధితుడు ఎస్పీతో మొర పెట్టుకున్నారు.
- హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం కేంద్రంలో డ్రా చేసిస్తామని చెప్పి ఇద్దరు వ్యక్తులు తన ఏటీఎం కార్డు తీసుకుని మార్పు చేసి బ్యాంకు ఖాతాలో రూ.50 వేలు డ్రా చేసుకుని మోసం చేశారని, సీసీ కెమెరాలో వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎన్‌ఆర్‌పేటకు చెందిన ఇక్బాల్‌బాషా ఫిర్యాదు చేశారు.
- కుమారుడు, కోడలు కలిసి తనను ఇంటి నుంచి వెళ్లిపోవాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇంటిని కూడా వేరేవాళ్లకు రిజిస్ట్రేషన్ చేశామని చెబుతూ మోసం చేస్తున్నారని కర్నూలు నాగిరెడ్డి కాలనీకి చెందిన మహబూబ్ బాషా ఫిర్యాదు చేశారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించండి

- ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల్లో చట్టపరిధిలో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించాలని నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో 96 వినతులు వచ్చాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన వినతులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

స్థల వివాదంలో టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

- పది మందికి పైగా గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం


గాయపడిన మహిళ


తీవ్ర గాయాలు కావడంతో కర్నూలుకు తరలిస్తున్న వైద్యసిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో సోమవారం ఓ స్థల వివాదంలో ఒకే వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణ మాటలతో ప్రారంభమై చివరకు రాళ్లతో దాడులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటాన గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. క్రిష్ణాపురం గ్రామంలో ఓ స్థల వివాదంలో కంప చెట్లు తొలగించే సమయంలో ఒకరినొకరు (రెండు వర్గాలూ టీడీపీకి చెందినవారే)దూషించుకుంటూ ఘర్షణకు పాల్పడ్డారు. కర్రలు, ఇనుప రాడ్లు, రాళ్లతో దాడులకు దిగారు. ఇరువర్గాలకు చెందిన పది మందికి రక్త గాయాలయ్యాయి. అందులో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు సీఐ రాము తన సిబ్బందితో క్రిష్ణాపురం చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గాయపడిన వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాధాన్యత కేటగిరి టీచర్లకు ప్రత్యేక వైద్య శిబిరం

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల స్కూళ్లలో పని చేస్తున్న అన్ని కేటగిరిల ఉపాధ్యాయులు ప్రాధాన్యత కేటగిరి, స్పెషల్ పాయింట్లకు అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(ధన్వంతరి కాన్ఫరెన్స్ హాల్) మూడో అంతస్తులో వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు.

పర్వతారోహకుడికి ఆర్థిక సాయం


సురేష్‌బాబుకు చెక్ అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రపంచంలోనే అత్యంత ఎత్తైనా 7వ శిఖరం దౌళగిరి పర్వతాన్ని అధిరోహించిన గోనెగండ్లకు చెందిన సురేష్‌బాబుకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆర్థిక సాయం అందజేశారు. 25 ఏళ్ల సురేష్‌బాబు ఇప్పటి వరకు 25 శిఖరాలను అధిరోహించడమే గాకుండా ఏడు ఖండాల్లోని 5 ఎత్తైనా శిఖరాలను అతి తక్కువ సమయంలో అధిరోహించి రికార్డు సృష్టించారు. సురేష్‌బాబు ధైర్యసాహసాలను కలెక్టర్ మెచ్చుకుని సీఎస్‌ఆర్ కింద జియో మైసూరు కంపెనీతో మాట్లాడి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించి అభినందించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, పీసీబీ ఈఈ కిశోర్‌రెడ్డి, జియోమైసూరు కంపెనీ ప్రతినిధి రామ్మోహన్ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థుల ప్రతిభ


డాక్టర్ మహేష్ (కార్డియాలజీ)


డాక్టర్ కిషన్ రెడ్డి (ప్లాస్టిక్ సర్జరీ)


డాక్టర్ రంగవేణి (నెఫ్రాలజీ)


డాక్టర్ ఆదిత్య (నెఫ్రాలజీ)


డాక్టర్ హిమజ (యూరాలజీ)

- రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు


కర్నూలు (హాస్పిటల్): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన వార్షిక పరీక్షల్లో కర్నూలు మెడికల్ కళాశాల సూపర్ స్పెషాలిటీ విభాగాల్లోని పీజీ వైద్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. కార్డియాలజీ విభాగంలో మహేష్ పునుగుపాటి స్టేట్ ఫస్ట్ ర్యాంకు, ఆదిత్య, రంగవేణి సమాన మార్కులతో నెఫ్రాలజీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు, కిషన్ రెడ్డి ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో స్టేట్ థర్డ్ ర్యాంకు, హిమజ యూరాలజీ విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించారు. వీరిని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే మంచి పేరున్న కర్నూలు మెడికల్ కళాశాల పేరును ఈ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి మరోసారి నిలబెట్టారని కొనియాడారు. కళాశాల సూపర్ స్పెషాలిటీ విభాగాల్లోని కార్డియాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లో మొత్తం 9 మంది పరీక్ష రాయగా అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని, అందులో ఐదుగురికి స్టేట్ ర్యాంకులు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ విభాగాలు ప్రారంభమైనప్పటి నుంచి కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులతో మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు.ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, యూరాలజీ హెచ్ఓడీ డాక్టర్ సీతారామయ్య, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ మంజుల బాయి, నెఫ్రాలజీ హెచ్ఓడీ డాక్టర్ అనంత్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్ఓడీ డాక్టర్ మోహన్‌రెడ్డి అభినందించారు.

23న జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 23న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు పురుష, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వరకు సబ్ జూనియర్ విభాగం, 15 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వరకు జూనియర్స్ విభాగం, 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు సీనియర్స్ విభాగమన్నారు. ఆయా విభాగాల్లో పాల్గొనదలచిన వారు వెంట ఆధార్ కార్డు తెచ్చుకొని ఎంపిక పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు వచ్చే నెల 5 వ తేదీ విజయవాడలో జరిగే సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బసవేశ్వర పురాణంలో ఆకట్టుకున్న సీమంతం


ప్రవచనం చెబుతున్న పండితుడు


ఎద్దుల బండిలో తినుబండరాలు తీసుకొస్తున్న దృశ్యం

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో జరుగుతున్న కల్బుర్గి శ్రీశరణ బసవేశ్వరస్వామి పురాణ ప్రవచనంలో భాగంగా సోమవారం రాత్రి జరిగిన సీమంతం భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రవచన కారుడు సిద్ధరామయ్యస్వామి హిరేమఠ శాస్త్రీ శరణ బసవేశ్వరస్వామి లీలలు గురించి వివరిస్తూ సీమంతం కార్యక్రమంపై భక్తులకు కథలు, గేయల రూపంలో చెప్పి ఆకట్టుకున్నారు. ఈనెల 30 వరకు జరిగే ఈ పురాణ ప్రవచన కార్యక్రమానికి వచ్చే చుట్టు పక్కల గ్రామాలు, దూర ప్రాంతాల భక్తులకు నిత్యం అన్నదానం చేపడుతున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్న గౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

పిడుగుపాటుకు దంపతులకు తీవ్ర అస్వస్థత

జూపాడుబంగ్లా: ఆదివారం సాయంత్రం మండలంలోని పోతులపాడు వ్యవసాయ పొలాల్లో పడిన పిడుగుపాటుకు ఎర్రన్న, రాజేశ్వరి దంపతులు తీవ్ర అస్వస్థతకు గురవ్వటంతో వారిని 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నీటిమునక పొలాల్లో రబీ సీజన్‌కు గాను సాగుచేసిన వరి పంటను ఎర్రన్న, భార్య రాజేశ్వరి నూర్పిడి చేసుకుంటుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవటంతోపాటు వారికి సమీపంలో పిడుగు పడింది. దీంతో ఎర్రన్న, రాజేశ్వరి తీవ్ర అస్వస్థతకు గురవ్వటంతో వారిని ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యువకుడిపై లాఠీ నృత్యం

- అకారణంగా చితక్కొట్టిన హెడ్ కానిస్టేబుల్



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమేష్‌బాబు, కందిన తొడ వెనుక భాగం

సంజామల: కూటమి ప్రభుత్వంలో పోలీసుల అరాచకాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. నొస్సం గ్రామానికి చెందిన రమేష్‌బాబు అనే యువకుడిని కానిస్టేబుల్ విచక్షణా రహితంగా చితకబాదిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాలు.. ఈనెల 19న నొస్సం గ్రామానికి చెందిన భరత్ మద్యం తాగి బస్టాండ్‌లో రోడ్డుపై అడ్డంగా బైక్ పెట్టి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. అదే క్రమంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్, మహిళా కండెక్టర్‌తో భరత్ వాగ్వాదానికి దిగాడు. దీంతో వారు విధులకు ఆటంకం కలిగిస్తున్నాడంటూ పోలీసుకు సమాచారం ఇచ్చారు. సమీపంలో ఉన్న రమేష్‌బాబు మహిళా కండెక్టర్‌కు భరత్‌తో సారీ చెప్పించి పంపించేశారు. ఈలోపు హెడ్‌కానిస్టేబుల్ నాగన్న, మరో ఇద్దరు పోలీసులు సాయంత్రం నొస్సం చేరుకుని భరత్ కోసం ఆరా తీశారు. అతడు కనపడకపోవడంతో రమేష్‌బాబును పోలీసు వాహనంలో పుచ్చయకాయపల్లె గ్రామ సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లి చితక్కొట్టారు. అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. తీవ్ర గాయాలతో ఇంటికి చేరుకున్న రమేష్‌బాబును కుటుంబ సభ్యులు వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స పొంది సాయంత్రం స్టేషన్‌కు చేరుకుని సీఐ హనుమంత్‌నాయక్‌ను కలిసి హెడ్‌కానిస్టేబుల్ నాగన్నపై ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా విచారించి కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COMPUTER EDUCATION

■ NICE COMPUTER SUMMER COURSES: M.S.Office, DTP, TALLY, C+, Phython, Photoshop, DCA, PGDCA etc. CONT: 1st Lane, V.R.Colony, KNL. ✆ 9396861308. [L-794805]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : ✆ 73821 14647. [V-6715]

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు– Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి: 7406393937 [HA-453]

WANTED

■ కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పనిచేయుటకు 39 స్త్రీ/పులు కావలెను. జీ:14వేలు+DA6వేలు+ బోనస్+ ఫ్రీ రూం, అ: 7th-డిగ్రీ, ITI డిప్లొమా (P/F), శ్రీనివాస టాకీస్, కల్లూరు రోడ్, కర్నూలు. 80748 16824 [L-794807]

■ J.M. కంప్యూటర్స్ నందు పనిచేయుటకు అకౌంటెంట్ (Tally), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (B.Tech) కావలెను. 5 సం॥ల అనుభవం ఉండాలి. అబ్దుల్లాఖాన్ ఎస్టేట్స్, షాప్.నెం:1, Opp: క్రేజీ బాయ్స్, కర్నూలు. సెల్: 98490 41008. [L-794809]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆఫీస్ అడ్రస్: ఓర్వకల్లు మండలం కాల్వ బుగ్గ శివాలయం టెంపుల్ ప్రక్కన. అర్హత: 10th పాస్. జీతం:16,000, రూమ్ ఫ్రీ, భోజన వసతి కలదు. Age: 19 to 45 సం॥. సంప్ర: ✆ 8897444705, 8106184820. [SCA25002873]

■ ప్రముఖ కంపెనీ తరుపున కర్నూలు జిల్లాలో స్కూల్ to స్కూల్ తిరిగి మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ కావలెను. Ph : 7702805174 [SCA-25002829]

■ Wanted for High school Exp & Qua: IIT Phy & Maths, Social (30 to 35K) Computer Electronics (15K) with food & accom. Preprimary Trs (10K) Back ground E.M.St. Antony's high school, Porumamilla, Kdp(dt). Contact : ✆ 93199 79999. [C-1272359]

■ No Bike Kurnool సిటీలో ప్రముఖ పిజ్జా సంస్థలో పనిచేయడానికి డెలివరీ బాయ్స్ కావలెను. స్మార్ట్ ఫోన్, పాన్, ఆధార్ & DL మస్ట్, వీక్లీ పేమెంట్స్. Ph: 8688909118, 8686242288 [HA-69]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. శ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 8520980099, 8520874499 [SCA25002806]

■ కష్టపడ్డే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 9014885406 [HA-379]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09165
70750 09185

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

నందికొట్కూరు: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకట శేషాద్రి సూచించారు. సోమవారం సబ్‌జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే ఉచిత న్యాయవాదులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. 70 ఏళ్ల పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఖైదీలు కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరుకావాలన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవ అధికార సంస్థను సంప్రదించాలన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100కు సమాచారం తెలియజేయాలన్నారు. కొందరు ఖైదీలు బెయిల్ మంజూరైనా జామీనుదారులు లేక జైలులోనే ఉన్నామని తెలియజేయడంతో విచారించి బెయిల్ మంజూరు కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఖైదీలకు అందించే ఆహారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

సారా తయారీదారులపై బైండోవర్ కేసులు

కర్నూలు: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుమ్మితం తండాలో 16 మంది సారా తయారీదారులపై ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. పలుమార్లు నాటుసారా స్థావరాలపై దాడులు చేసి విక్రయ, రవాణాదారులను అరెస్టు చేసి జైలుకు పంపినప్పటికీ మార్పు రాకపోవడంతో గుమ్మితం తండా గ్రామానికి చెందిన బిలావత్ స్వామి నాయక్, బిలావత్ బాలు నాయక్, దేశవత్ రాముడు నాయక్, దశావత్ థౌరు నాయక్, లక్ష్మా నాయక్, రాము నాయక్, మల్యాల లక్ష్మీబాయి, మదిర సుభా నాయక్, ముదిరేచ బాలాజీ నాయక్, ఎం.కృష్ణా నాయక్, ఎం.సురేష్ నాయక్, ఎం.వాసు నాయక్, మున్నే నాయక్, రవి నాయక్, లక్ష్మీబాయి, ఎస్.వెంకటమ్మ తదితరులపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి. వీరందరినీ ఎస్ఐ రెహనా ఆధ్వర్యంలో ఓర్వకల్లు తహసీల్దార్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేశారు.

స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా కేసు నమోదు చేయడం లేదు

- కలెక్టరేట్ ఎదుట హెడ్‌కానిస్టేబుల్ కుటుంబం ఆందోళన



ధర్నా చేస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నాలుగు నెలలుగా తిరుగుతున్నా కర్నూలు రూరల్ సీఐ, ఎస్ఐలు పట్టించుకోవడం లేదని ఓ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబం సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగింది. తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డీఐజీ, ఎస్పీలను కోరినా స్పందించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ఆందోళనకు దిగినట్లు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఏ.శ్యామ్ విద్యాసాగర్ కోడలు సి.ఉమాదేవి, భర్త అడ్డాకుల మహేష్ వాపోయారు. తమకు న్యాయం చేకపోతే ఆత్మహత్యే గతి అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము కర్నూలు నగరంలోని రాజ్ ఫంక్షన్ హాలు సమీపంలో శ్రీరామ రెసిడెన్సీలో మామ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఏ.శ్యామ్ విద్యాసాగర్‌తో కలిసి ఉంటున్నామన్నారు. గత జనవరి 22న సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు(వాసు), ఎస్పీఎఫ్ పోలీసు మల్లికార్జున, ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మన్న ఇంటి వద్దకు వచ్చి తన మామను తీసుకెళ్లి మరో పదిమందితో కలిసి దాడి చేశారన్నారు. విషయం తెలిసి తాము అక్కడికి వెళ్లగా తమపై కూడా దాడి చేశారన్నారు. కత్తి మొన తనకు కుచ్చుకొని తీవ్ర రక్తగాయం కాగా తప్పించుకొని ఇంటికి వచ్చేశానన్నారు. అయినా వదలకుండా వారు తమ ఇంటికి వచ్చి తనతోపాటు తన భర్త అడ్డాకుల మహేస్, తన బావలు హరీష్, గిరీష్‌లపై దాడి చేసి గాయపరిచారన్నారు. తామంతా పెద్దాసుపత్రిలో చికిత్స చేయించుకుంటుండగా కర్నూలు రూరల్ స్టేషన్ నుంచి సీఐ, ఎస్ఐ పిలుపుస్తున్నారంటూ కానిస్టేబుల్ చంద్ర ఫోన్ చేయగా అక్కడికి వెళ్లామన్నారు. స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ సమక్షంలోనే మరోసారి తమపై పోలీసులు దాడి చేశారన్నారు. ఫిర్యాదు తీసుకోకుండా సీఐ చింపివేసి, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోవాలని పంపించేశారన్నారు. ఇదే విషయాన్ని కర్నూలు రేంజ్ డీఐజీ, ఎస్పీకి విన్నవించినా పట్టించుకోకపోవడంతో ధర్నాకు దిగినట్లు ఆమె వివరించారు.